క్లుప్తంగా

నేటి నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం



పొన్నూరు: ప్రత్తిపాడు 220 కేవీ సబ్ స్టేషన్‌లోని 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కారణంగా నేటి నుంచి ఈ నెల 23 వరకు పొన్నూరు సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని డీఈఈ ఎ.వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 8 రోజుల పాటు నిర్వహించనున్న ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల నేపథ్యంలో రోజు పలు సమయాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ముగిసిన అమరావతి నృత్యోత్సవం



నగరంపాలెం: భారతీయ సంస్కృతికి పట్టుకొమ్మలు లలిత కళలు అని జాతీయ సేవా పథకం రాష్ట్ర అధికారి మద్దినేని సుధాకర్ అన్నారు. బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివిటీ అండ్ కల్చరల్ కమిషన్, కేఆర్‌కేఎం మెమోరియల్ అకాడమీ ఆఫ్ ఫైన్స్ ఆర్ట్స్ సంయుక్తంగా మూడు రోజులుగా నిర్వహిస్తున్న అమరావతి నృత్యోత్సవాలు–25 శనివారంతో ముగిశాయి. కార్యక్రమంలో కళారత్న రాయన గిరిధర గౌడ్, దేవస్థానం పాలక మండలి ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, అకాడమీ అధ్యక్షులు డాక్టర్ కాజా వెంకటసుబ్రహ్మణ్యం, కార్యదర్శి, నాట్య విశారద కోశా విజయలక్ష్మి, ఫెస్టివల్ సమన్వయకర్త కూచిపూడి రవి పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



తెనాలి: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక, గుంటూరు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో తెనాలి రూరల్ మండల గ్రామం సోమసుందరపాలెంలో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ త్రైత సిద్ధాంత జ్ఞాన గ్రంథాల ప్రచారం నిర్వహించారు. దైవజ్ఞానం ప్రకారం కులాలు అహేతుకం అని, మతాలు నిషిద్ధం అని ప్రతి ఒక్కరు తెలుసుకోవాన్నారు. త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథం శ్రీకృష్ణుడి అసలైన జ్ఞానాన్ని తెలియజేస్తుందని, ప్రతి ఒక్కరూ కర్మ యోగం విశిష్టత, త్రైత సిద్ధాంత జ్ఞానం తెలుసుకోవాలి అనే ముఖ్య ఉద్దేశంతో భగవద్గీత ప్రచారం చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. మన శరీరంలో దేవుడు మూడు ఆత్మలుగా విభజింపబడి ఉన్నాడని – జీవాత్మ, ఆత్మ, పరమాత్మల గురించి తెలుసుకోవడమే త్రైత సిద్ధాంతం అన్నారు. భగవద్గీతలో కర్మయోగం, బ్రహ్మయోగం, భక్తియోగం అనేవి దైవ ధర్మాలనీ, వాటి ప్రకారం నడుచుకుంటే కర్మ నుంచి బయట పడేసి మనిషికి ముక్తిని ఇస్తాయని వివరించారు. త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి – ఇందూ జ్ఞాన వేదిక గుంటూరు కమిటీ అధ్యక్షుడు రౌతు శ్రీనివాసరావు, సభ్యులు టీవీ కృష్ణారావు, బి.శివ లింగంనాయక్, జె.హరిబాబు, ఫణిధరం శివ, పట్టాబి శ్రీను, మౌనిక, షేక్ దిల్షా, ఎ.అన్నపూర్ణ, ఎ.షైనీ పాల్గొన్నారు.

భూ సారం.. తాత్సారం

- సేకరణకే పరిమితమైన మట్టి నమూనాలు
- ఖరీఫ్ సాగు మొదలైనా అందని పరీక్ష ఫలితాలు



మార్చి, ఏప్రిల్ నెలల్లో మట్టి నమూనాలను సేకరిస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

ప్రత్తిపాడు: ధరణి ఒడిలో భూ'సారం' రోజురోజుకు తగ్గుతుంది. విచ్చలవిడిగా రసాయన ఎరువుల వినియోగంతో భూమిలో సారం తగ్గిపోతుంది. సాగు చేసిన పంటలు తెగుళ్లు, పురుగుల బారిన పడి దెబ్బతింటున్నాయి. రైతు తీవ్రంగా నష్టపోతున్నాడు. ఈ నేపథ్యంలో ఏ భూమిలో ఏ పంట సాగు చేస్తే దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయి? భూమిలో ఏమేమి ధాతువులు ఉన్నాయి? ఎలాంటి లోపాలు ఉన్నాయి..? ఎటువంటి పోషక విలువలున్నాయి.. వంటివి తెలియాలంటే భూసార పరీక్షలు తప్పనిసరి. దీని కోసం వ్యవసాయ శాఖ ఏటా మట్టి నమూనాలను సేకరిస్తుంది. వాటిని పరీక్షించి ఫలితాలు సాగుకు ముందే సకాలంలో రైతులకు చేరితే.. దాన్ని బట్టి వారు తమ పొలాల్లో ఎలాంటి లోపాలున్నాయో తెలుసుకుని వాటిని అధిగమించేలా సాగుకు సన్నద్ధమయ్యే అవకాశం ఉంటుంది. అలాగే ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో మట్టి నమూనాలను అధికారులు సేకరించారు. కానీ భూసార పరీక్షల ఫలితాలను అందించడంలో వ్యవసాయ శాఖ తాత్సారం చేస్తుంది. ఈ ప్రక్రియ కేవలం నమూనాల సేకరణ వరకే పరిమితమయ్యింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై, ఇప్పటికే పంటలు సాగు చేసినప్పటికీ నేటికీ భూ సార పరీక్షల ఫలితాలు రైతుల దరి చేరలేదు.

ఫలితాల ఊసే లేదు

2025–26 సంవత్సరానికి సంబంధించి సాయిల్ హెల్త్ అండ్ ఫెర్టిలిటీ స్కీం పీఎం ఆర్‌కేవీవై కింద మట్టి నమూనాలను వ్యవసాయ శాఖ సిబ్బంది సేకరించారు. ప్రత్తిపాడు మండలంలో 830, పెదనందిపాడు మండలంలో 480, వట్టిచెరుకూరులో 820, కాకుమానులో 1,150, గుంటూరు రూరల్ మండలంలో 520 మట్టి నమూనాలను ఆయా మండలాల వ్యవసాయాధికారుల ఆధ్వర్యంలో రైతు సేవ కేంద్రాల సిబ్బంది సేకరించి, పరీక్షలకు పంపారు. ఇంతవరకూ బాగానే ఉన్నా నేటికీ ఫలితాల ఊసే లేదు. సాయిల్ హెల్త్‌కార్డుల జాడలే కనిపించడం లేదు. ఇప్పటికే నియోజకవర్గంలో వేల ఎకరాల్లో పత్తి, వరి పంటలు రైతులు సాగు చేశారు. కాగా ప్రత్తిపాడు నియోజకవర్గంలో సుమారు 57,223 మంది రైతులుండగా, 34 వేల హెక్టార్ల సాగు భూమి ఉంది.

పరీక్షతో ఉపయోగాలు

భూమిలో పోషక విలువలు ఎంత మోతాదులో ఉన్నాయో తెలుసుకుంటే, అందుకు తగినట్లుగా భూమిని ఆరోగ్యకరంగా మలుచుకోవచ్చు. భూసార పరీక్షలతో భూమిలో పోషకాలు, ఖనిజాలు ఏ స్థాయిల్లో ఉన్నాయో తెలుసుకుని, దానికి అనువైన పంటను సాగు చేసుకోవచ్చు.

- ఫలితాల నివేదికలపై గుంటూరు ఏడీఏ ఎస్. మోహన్‌రావును 'సాక్షి' వివరణ కోరగా భూసార పరీక్షల ఫలితాలు త్వరలోనే వస్తాయన్నారు. ఇప్పటికే సేకరించిన నమూనాల ఆధారంగా భూసార పరీక్షలు ల్యాబ్‌లో పూర్తి చేయడం జరిగిందని తెలిపారు.

భూసార పరీక్ష అంటే..

భూసార పరీక్ష అంటే నేల భౌతిక, రసాయనిక లక్షణాలు తెలియజేసే కొలమానం. పొలం నుంచి వివిధ ప్రదేశాలలో సేకరించిన మట్టిని పలు భౌతిక, రసాయన పద్ధతుల ద్వారా విశ్లేషించి దాని లక్షణాలను తెలుసుకుంటారు. భూసార లోపాల వలన భూమి తన సహజత్వాన్ని కోల్పోతుంది. మానవులకు పోషకాహారం ఎంత ముఖ్యమో, నేలకు కూడా పోషక విలువలు అంతే ముఖ్యం. అవి సరిగా లేకుంటే ఆ ప్రభావం మొక్క పెరుగుదలపై పడుతుంది.

అగస్తేశ్వరాలయంలో 22 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

గుంటూరు రూరల్: నల్లపాడు గ్రామంలో వేంచేసియున్న అగస్తేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 22వ తేదీ నుంచి దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి డి.వెంకటేశ్వర్లు, ఆలయ అర్చకుడు తుర్లపాటి ప్రసన్నాంజనేయశర్మ (పవన్) ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహోత్సవాలు 22వ తేదీ సోమవారం నుంచి అక్టోబర్ 2వ తేదీ గురువారం వరకు కొనసాగుతాయని తెలిపారు. 22వ తేదీన సోమవారం అమ్మవారికి బాలత్రిపుర సుందరిదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తారన్నారు. అదే విధంగా 23వ తేదీన గాయత్రిదేవి, 24వ తేదీన అన్నపూర్ణాదేవి, 25వ తేదీన పార్వతిదేవి, 26న మహాలక్ష్మిదేవి, 27న లలితాత్రిపురసుందరిదేవి, 28న మహాచండీదేవి, 29న సరస్వతిదేవి, 30న దుర్గాదేవి, అక్టోబర్ 1వ తేదీన మహిషాసురమర్ధిని, 2వ తేదీన రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనం కల్పిస్తారన్నారు. తొమ్మిది రోజులపాటు ఆలయంలో ప్రతి రోజు ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, చండీ హోమాలు జరుగుతాయన్నారు. అమ్మవారికి పుష్పార్చనలు, పసుపు కుంకుమ పూజలు జరుగుతాయని తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం 6 గంటల నుంచి అర్చనలు పంచహారతులు, నీరాజనం, తీర్థప్రసాద వితరణ జరుగుతుందని, భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు తమ పేర్లు, గోత్రనామాలను ఆలయం వద్ద నమోదు చేసుకోవాలని కోరారు.

డాక్టర్ వసంతరావుకు బెస్ట్ టీచర్ అవార్డు



డాక్టర్ వసంతరావును సత్కరిస్తున్న నెల్లూరు ఆర్ఐఈ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రమేష్‌బాబు తదితరులు

పెదకాకాని(ఏఎన్‌యు): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎడ్యుకేషన్ విభాగంలో అతిథి అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఎం.వసంతరావుకు బెస్ట్ టీచర్ అవార్డు లభించింది. ఆంధ్రప్రదేశ్ ఎంఈడీ ప్రాస్పరిటీ అసోసియేషన్ (ఏపీఎంపీఏ) ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ కానూరులో జరిగిన బెస్ట్ టీచర్ అవార్డు ప్రదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నెల్లూరులోని ఆర్ఐఈ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రమేష్‌బాబు మాట్లాడుతూ చాలా మంది బీఈడీ కోర్స్‌తో వారి విద్యాభ్యాసం ఆపివేసి ఆ తర్వాత డీఎస్సీ ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్ టీచర్లుగా పనిచేస్తుంటారన్నారు. ఎంఈడీ కోర్స్‌తో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. విజయవాడలోని ఇగ్నో రీజనల్ సెంటర్ డైరెక్టర్ బి.ప్రసాద్ బాబు మాట్లాడుతూ నేటి సమకాలీన ప్రపంచంలో శాస్త్ర సాంకేతిక రంగాలకే అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతోందని కానీ మానవీయ శాస్త్రాల్లో విద్యా బోధనకు చాలా ప్రాధాన్యత ఉందన్నారు. అందులో మాస్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ కోర్స్‌కు అధిక ప్రాధాన్యత ఉందన్నారు. అభ్యర్థులు ఎంఈడీ కూడా చేయాలని సూచించారు. ఆర్‌వీఆర్ ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ అనేక మందిని ఉత్తమ టీచర్లుగా రూపుదిద్దే అవకాశం ఎంఈడీ కోర్సు చేసిన వారికి ఉంటుందన్నారు. అనంతరం డాక్టర్ ఎం.వసంతరావుకు బెస్ట్ టీచర్ అవార్డును ప్రదానం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 10 మందిని గుర్తించి అవార్డులను అందజేశారు. వసంతరావు బోధన, పరిశోధన రంగాల్లో ప్రత్యేక స్థానాన్ని అలంకరించారన్నారు. కౌన్సిలర్‌గా సైకాలజిస్ట్‌గా 100కు పైగా కార్యక్రమాల్లో పాల్గొని అవగాహన కల్పించారన్నారు. ఆయనలో నేర్చుకునే తత్వం, అంకితభావం, క్రమశిక్షణ ఈ అవార్డుకు ఎంపిక చేశాయన్నారు. 15 సంవత్సరాలపైగా టీజేపీఎస్ కళాశాలలో లెక్చరర్‌గా, ఇగ్నో గుంటూరు ఒరిజినల్ సెంటర్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహించి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో 10 సంవత్సరాల నుంచి ఎంఈడీ అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఇప్పటి వరకు 2 పుస్తకాలు రాసారని, 50కి పైగా జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో పరిశోధన పత్రాలు ఆయన ముద్రించారని, పలు సంస్థలు ఆయనను బెస్ట్ రీసెర్చర్, బెస్ట్ టీచర్, ఎడ్యుకేటర్ అవార్డులతో సత్కరించాయని కొనియాడారు.

99 అడుగుల గణపతికి 99 కిలోల లడ్డూ సమర్పణ



లడ్డూను ఉత్సవ కమిటీ సభ్యులకు అందజేస్తున్న దాత నాగమల్లేశ్వరరావు

గుంటూరు రూరల్: నగర శివారు ఇన్నర్ రింగ్ రోడ్డు శ్రీ చైతన్య కళాశాల గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన 99 అడుగుల మట్టి మహాగణపతి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం స్వామి వారికి 99 కిలోల లడ్డూను యడ్ల నాగమల్లేశ్వరరావు బహూకరణ చేశారు. ఈ సందర్భంగా 99 కిలోల లడ్డూను గోరంట్ల సెంటర్ నుంచి ఇన్నర్ రింగ్ రోడ్‌లోని 99 అడుగుల మట్టి మహాగణపతి విగ్రహం వరకు భారీ ర్యాలీతో ఊరేగింపుగా తరలించారు. ఈ ర్యాలీలో సుమారు 500 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమరావతి మట్టి మహా గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు స్వామి వారి లడ్డూను 99 అడుగుల మట్టి మహాగణపతి వద్ద ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లడ్డూ దాత యడ్ల నాగమల్లేశ్వరరావు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం ఆర్ట్ ఆఫ్ నటరాజ్ గురువు విజయగౌరి ఆధ్వర్యంలో భక్త ప్రహ్లాద బ్యాలెట్ అనే సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు. ఈ ర్యాలీలో అమరావతి మట్టి మహాగణపతోత్సవ కమిటీ చైర్మన్ నరేంద్ర, వైస్ చైర్మన్ రాజానాయుడు, సెక్రటరీ లక్ష్మీనారాయణ రెడ్డి, రాజేష్, హేమంత్, జాకీర్, గణేష్, రామాంజనేయరెడ్డి, కమిటీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



పొన్నూరు: పట్టణంలోని సజ్జా కల్యాణ మండపం సమీపంలో శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. సీఐ వీరానాయక్ తెలిపిన వివరాల ప్రకారం మృతి చెందిన వ్యక్తికి దాదాపు 35 ఏళ్ల వయసు ఉంటుందని తెలిపారు. కాఫీ రంగు చొక్కా, నలుపు రంగు నైట్ ప్యాంటు ధరించి ఉన్నాడని అన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి గుర్తు తెలియని మృతదేహాన్ని పొన్నూరు ప్రభుత్వ వైద్యశాలలో ఉంచినట్లు తెలిపారు. సంబంధీకులు 9440796172(సీఐ), 9676262840(ఎస్ఐ) నంబర్లను సంప్రదించాలని కోరారు.

దాసకుటిలో భక్తుల సందర్శనార్థం శ్రీరాముని కోదండం

తెనాలి: అయోధ్యలో శ్రీరామచంద్రమూర్తి వంశీకులచే కళ్యాణ రామమందిర నిర్మాణం సందర్భంగా వారి కోదండం సోమవారం ఉదయం రూరల్ మండల గ్రామం అంగలకుదురులోని దాసకుటిలో భక్తుల సందర్శనార్థం ఉంటుందని ఆశ్రమ పీఠాధిపతి శ్రీసీతారామదాసస్వామి వెల్లడించారు. అంగలకుదురులోని ఆంధ్రవాల్మీకి శ్రీవాసుదాసు స్వామి వారి పరంపర పీఠం 'దాసకుటి'లో 74వ శ్రీమహాలక్ష్మి అమ్మవారి కుంకుమార్చన షష్ఠమ పీఠాధిపతి శ్రీసీతారామదాసస్వామి ఆధ్వర్యంలో కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఆదివారం రమాసహిత శ్రీసత్యనారాయణస్వామి వ్రతం జరిపారు. కుంకుమపూజ, హోమం నిర్వహించారు. 15వ తేదీన మహాలక్ష్మి అమ్మవారికి 16 కలశాలతో అభిషేకం, పూర్ణాహుతి ఎంతో విశేషంగా జరుగుతాయని శ్రీసీతారామదాసస్వామి తెలియజేశారు. ఇదే సందర్భంగా అయోధ్యలో శ్రీరామచంద్రమూర్తి వంశీకులచే కళ్యాణరామ మందిరం, 108 అడుగుల శ్రీరాముని విగ్రహ నిర్మాణం జరుగుతున్నాయి. వారి కోదండం ఉదయం 9.30 గంటల్నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు దాసకుటిలో ఉంటుందని, భక్తులు దర్శించుకోవాలని ఆయన కోరారు.

కేఎల్‌యూలో ముగిసిన స్కిల్ పలావర్



స్కిల్ పలావర్ ప్రాజెక్టును విద్యార్థులకు వివరిస్తున్న కేఎల్‌యూ ఆచార్యులు

తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో స్కిల్ డెవలప్‌మెంట్ విభాగం ఆధ్వర్యాన ఆదివారం విద్యార్థులకు స్కిల్ పలావర్ నిర్వహించారు. స్కిల్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్ మాట్లాడుతూ స్కిల్ పలావర్ మూడు దశల్లో వేర్వేరు సమయాల్లో ఆయా విభాగాల విద్యార్థుల సమూహాలను లక్ష్యంగా చేసుకుని నిర్వహించామని తెలిపారు. ప్రతి దశలో మూడు ముఖ్యమైన భాగాలు ఉన్నాయని, వాటిలో లెర్నథాన్, ఆన్‌లైన్ రివ్యూ, హ్యాకథాన్ అని, ఈ నమూనా ప్రకారం విద్యార్థులకు ప్రగతిశీల విద్యా ప్రయాణాన్ని అందిస్తున్నామన్నారు. స్కిల్ పలావర్ మూడో దశలో విద్యార్థులు 10 ప్రధాన సవాల్ రంగాల్లో పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమాన్ని ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.రాజేష్, సీఎస్ఈ, ఈసీఈ, ట్రిపుల్ ఈ, ఏడీ డీఎస్, సీఎస్ ఐటీ, సీఈ విభాగాలు, వాటి అనుబంధ విభాగాల విభాగాధిపతులు, స్పోక్‌లు సమన్వయం పరిచారు. వర్సిటీ వీసీ డాక్టర్ పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఎస్. వెంకట్రామ్, డాక్టర్ రాజశేఖరరావు తదితరులు పర్యవేక్షించారు.

ప్రమాద బీమా చెక్కు పంపిణీ

తెనాలిఅర్బన్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జనసేన కార్యకర్త కుటుంబానికి రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రమాద బీమా చెక్కును ఆదివారం పంపిణీ చేశారు. సుల్తానాబాద్‌కు చెందిన కన్నెగంటి ఝాన్సీరాణి, ఖాజీపేటకు చెందికు పోతాబత్తిన వరుణ్ నాగ్ ఇటీవల వేరు వేరుగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందారు. వారి ఇళ్ళకు వెళ్ళి ప్రమాద భీమాకు సంబంధించిన రూ.5లక్షల చెక్కును పంపిణీ చేశారు.

అల్లాడుతున్న పల్లె ప్రజలు

- జ్వరాలతో మంచం పడుతున్న పల్లెలు
- పలు గ్రామాల్లో అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ
- చర్యలు చేపడుతున్న వైద్య సిబ్బంది



మామిళ్లపల్లిలో ద్రావణం పిచికారీ చేయిస్తున్న వైద్య సిబ్బంది



గ్రామంలో అధ్వానంగా ఉన్న మురుగు వ్యవస్థ

పొన్నూరు: గత కొద్ది రోజులుగా వాతావరణంలో వచ్చిన మార్పులు, కురుస్తున్న వర్షాల ప్రభావం, పడకేసిన పారిశుద్ధ్యంతో వైరల్ జ్వరాలు చాపకింద నీరులా వ్యాపిస్తుండడంతో పల్లె ప్రజలు మంచం పడుతున్నారు. బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండటంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు రోగులతో కిక్కిరిసిపోతున్నాయి. టైఫాయిడ్, మలేరియా, వైరల్ జ్వరాలతో ప్రజలు బాధపడుతున్నారు. వైద్య ఖర్చులు భరించలేక పేదలు అల్లాడుతున్నారు. తీవ్రమైన జ్వరంతో పాటు, జలుబు, కీళ్ల నొప్పులు, గొంతు నొప్పి, కాళ్ల మంటలు, దగ్గు వంటి సమస్యలతో ఆసుపత్రుల్లో చేరుతున్న వారి సంఖ్య క్రమేపి పెరుగుతోంది. ప్రస్తుతం వైరల్ జ్వరాలు నమోదవుతున్నాయని మన్నవ పీహెచ్‌సీ సిబ్బంది చెబుతున్నారు.

- పొన్నూరు మండలంలో 29 గ్రామాలు ఉండగా వాటిలో 15 గ్రామాలు మన్నవ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్నాయి. మిగిలిన గ్రామాలు నిడుబ్రోలు సీహెచ్‌సీ పరిధిలోకి వస్తాయి. ఇటీవల మామిళ్లపల్లి గ్రామంలో ఓ మహిళకు డెంగీ జ్వరం లక్షణాలు కనిపించాయి. ఆ గ్రామంతో పాటు గోళ్లమూడి పాడు, బ్రాహ్మణకోడూరు, వెల్లలూరు గ్రామాల్లో మరికొంత మందికి జ్వరాలు ఉండటంతో వెంటనే స్థానికంగా జ్వరాలను అదుపులోకి తీసుకువచ్చేందుకు వైద్య సేవలతో పాటు, పారిశుద్ధ్య నివారణ చర్యలు చేపట్టినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. సాధారణ రోజుల కంటే అధికంగా వైరల్ జ్వరాలు నమోదవుతున్నాయని చెబుతున్నారు.

జ్వరాల తీవ్రత ఇలా..

ప్రస్తుతం మన్నవ పీహెచ్‌సీ పరిధిలో ఏఎన్‌ఎంలు నిర్వహిస్తున్న సర్వేలో ప్రతి గ్రామంలో 5 నుంచి 8 మంది జ్వర పీడితులు ఉంటున్నారని వైద్య సిబ్బంది చెబుతున్నారు. మరోవైపు జ్వరాలతో ఆర్ఎంపీలను ఆశ్రయించే వారూ ఎక్కువగా ఉన్నారని, కోలుకునే సరికి ఒక్కొక్కరికి రూ.2 వేల వరకూ ఖర్చవుతుందని బాధితులు వాపోతున్నారు.

అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ

పలు గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురుగు కాల్వలు దోమలు ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయి. దీంతో ప్రజలపై పగలు, రాత్రి కూడా దోమలు దాడి చేస్తుండటంతో జ్వరాల బారిన పడుతున్నారు.

నివారణ చర్యలు చేపడుతున్నాం

మన్నవ పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో జ్వరాలు ప్రబలకుండా తగిన చర్యలు చేపడుతున్నాం. ఇంటింటి సర్వే చేపట్టి జ్వరాలు నమోదవుతున్న గ్రామాల్లో రక్త పరీక్షలు నిర్వహిస్తున్నాం. మురుగు కాలువల్లో ద్రావణం పిచికారీ చేయిస్తున్నాం. కుండీలు, ట్యాంకులలో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– ఎం.వేణు, పీహెచ్‌సీ సూపర్‌వైజర్, మన్నవ